క్లుప్తంగా

21న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సమావేశం

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ వార్షిక సమావేశం, నూతన కార్యవర్గం ఎన్నిక ఈ నెల 21న ఉదయం 10 గంటలకు పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరుగుతుందని అసోసియేషన్ బాధ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 ఏళ్లు నిండిన పెన్షనర్స్‌కు సత్కారం ఉంటుందని, సభ్యులందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్



సత్తెనపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం తండాకు చెందిన జయరామ్ అక్రమంగా మద్యం బాటిళ్లు అమ్ముతుండగా సత్తెనపల్లి ఎక్సైజ్ బృందం దాడి చేసి అదుపులోకి తీసుకుంది. అతని నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుంది. కేసు నమోదు చేసినట్లు సీఐ పి.విజయకుమార్ తెలిపారు.

బాధితులకు అండగా సీఎం సహాయ నిధి



సత్తెనపల్లి: వివిధ రుగ్మతలతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయి వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గల తన కార్యాలయంలో సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి చెందిన యదలాపురపు అనూషకి రూ.1,48,952, గుజ్జర్లపూడి గ్రామానికి చెందిన గంగూరు మధుసూదన్‌రావుకు రూ.1,46,075, నకరికల్లు గ్రామానికి చెందిన తిరుమల శెట్టి వెంకయ్యకు రూ.1,26,990, ముప్పాళ్ల మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన చింకా నాగేంద్రకు రూ.1,03,926 నగదు చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మక్కపాటి రామచంద్రరావు, పూజల వెంకట కోటయ్య తదితరులు ఉన్నారు.

నిరుపేదలం..భూమి ఇవ్వండి



అచ్చంపేట: నిరుపేదలమైన తమకు అసైన్డ్ భూములను కేటాయించాలని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన 14 బీసీ కుటుంబాలు మంగళవారం చింతపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్‌ను విన్నవించాయి. పుట్లగూడెం, చింతపల్లి, చెరుకుంపాలెం గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను సర్వే చేయించి తమకు పంపిణీ కోరారు. భూములు కావాలని కోరిన వారిలో కత్తుల గోపీకృష్ణారెడ్డి, సానికొమ్ము వేదాద్రి, కుంభా నాగరాజు, కృష్ణ, గంగమ్మ, శారద, సీతామహాలక్ష్మీ, నాగసంధ్య, నరసమ్మ, జయమ్మ, తిరుపతమ్మ తదితరులు ఉన్నారు.

డీసీ-7 చైర్‌పర్సన్‌గా శివలక్ష్మి

బెల్లంకొండ: నాగార్జున సాగర్ ప్రాజెక్టు కెనాల్స్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ -7 చైర్‌పర్సన్‌గా అనుపాలెం సాగునీటి సంఘం అధ్యక్షురాలు అంచుల శివలక్ష్మి, ఉపాధ్యక్షుడిగా చొక్కా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ -7 కింద ఉన్న నీటి సంఘాలకు మంగళవారం క్రోసూరులోని సబ్ డివిజన్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించినట్లు బెల్లంకొండ ఎన్ఎస్‌పీ ఏఈ ఇబ్రహీం తెలిపారు. డీసీ-7లో గుళ్ళపల్లి, ఉప్పలపాడు, గణపవరం, అనుపాలెం, బెల్లంకొండ-1, కోనంకి, బెల్లంకొండ -2, బ్రుగుబండ, 88 తాళ్లూరు, పీసపాడు నీటి సంఘాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు జునుగు వెంగళ రెడ్డి, తెల్లగొర్ల ఏడుకొండలు, కమ్మ శ్రీనివాసరావు, నందిపాటి శ్రీనివాసరెడ్డి, షేక్ ముస్తఫా, మాగంటి అప్పారావు, పొన్నగంటి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తా రూ.1,720

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం, దమ్మాలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏఓ ఎం.అరుణ రైతులకు సూచనలు అందించారు. ధాన్యం విక్రయించే రైతులు రైతు సేవ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్వింటా రూ.2,320 అనగా 75 కేజీల బస్తా రూ.1,720 చొప్పున అమ్ముకోవచ్చన్నారు. రబీ పంటకు గాను పంట నమోదు ప్రక్రియ జరుగుతుందని, రైతులు సాగు చేసిన పంట వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దాళ్వా సాగు చేసిన రైతులు ఎకరానికి రూ.630 చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీ ప్రసాదు, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

విజన్ అంటే పాలనను ప్రజల వద్దకు చేర్చడం. పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందించి..వారి బంగారు భవిష్యత్తును కలలు కనడం, సాకారం చేయడం. ఇవన్నీ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎలాంటి ఆటంకం లేకుండా ప్రజలకు అందాయి. ఇందుకు నిదర్శనం..బెల్లంకొండ మండలంలోని శ్రీరామాంజనేయపురం గ్రామం. ఈ అటవీ ప్రాంతానికి ఒకప్పుడు వైఎస్సార్ విద్యుత్ సౌకర్యం కల్పించి వెలుగునిస్తే..అక్కడి పిల్లల కోసం మాజీ సీఎం వైఎస్ జగన్ నూతన బడినే బహుమతిగా ఇచ్చారు. 40 ఏళ్ల గ్రామ కలన తీరుస్తూ.. కొత్త ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మించారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంత వరకు ఆ బడిని ప్రారంభించ లేదు. ఉపాధ్యాయులను కేటాయించి పిల్లలకు చదువు చెప్పిద్దామన్న ఆలోచన కూడా చేయలేదు. మద్యాన్ని ఏరులై పారిస్తూ..మారు మూల పల్లెలకూ బెల్టు షాపులు విస్తరిస్తూ..నిషా ఎక్కిస్తోంది. నాణ్యమైన మద్యం ఇస్తున్నామంటూ గొప్పలకు పోతోంది కానీ, పిల్లల భవితను తీర్చిదిద్దే ఒక బడిని ప్రారంభించి..తరగతులు నిర్వహించ లేకపోతోంది.



శ్రీరామాంజనేయపురం గ్రామం

చదువుకు అవస్థలు

ఒక ప్రాథమిక పాఠశాలను ప్రారంభించలేకపోతున్న ప్రభుత్వం

- భవనం నిర్మించి ఏడాదైనా.. ప్రారంభం కాని తరగతులు
- ఉపాధ్యాయులను కేటాయించకుండా నిర్లక్ష్యం
- విద్యార్థులకు తప్పని ఐదు కిలో మీటర్ల నడక
- రామాంజనేయపురంలో దుస్థితి..



శ్రీరామాంజనేయపురంలో గత ప్రభుత్వం నిర్మించిన పాఠశాల భవనం

బెల్లంకొండ: మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం పంచాయతీ పరిధిలోని శ్రీ రామాజంనేయపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం ప్రారంభానికి నోచుకోలేదు. భవన నిర్మాణం పూర్తయినా..అధికారులు పాఠశాలగా గుర్తించడం లేదు. సిబ్బందిని కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతేడాది పాఠశాల నిర్మించడంతో.. ఈ విద్యా సంవత్సరం విద్యా బుద్ధులు నేర్పిస్తారనన్న తల్లిదండ్రులు, చిన్నారుల ఆశలు అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. అధికారులను ఈ విషయంపై ప్రశ్నిస్తే.. పాఠశాలకు డైస్ కోడ్ రావాలని, కోడ్ వస్తేనే సిబ్బంది కేటాయించడానికి వీలుంటుందని మాట దాటవేస్తున్నారు. దీంతో గ్రామంలోని విద్యార్థులు ఊరిలో పాఠశాల ఉన్నప్పటికీ, ఐదు కిలోమీటర్ల దూరంలోని పక్క గ్రామానికి వెళ్లి చదువుకోక తప్పడం లేదు. అటవీ ప్రాంతం కావడం, రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో చిన్నారులు పాఠశాలకు వెళ్లేందుకు నానా పాట్లు పడుతున్నారు. ఆటోలకు వెళ్లడం లేదా బైక్‌లపై వెళ్లే వారిని లిఫ్ట్ అడిగి పాఠశాలకు చేరుకుంటున్నారు. కొంతమంది చిన్నారులు అటవీ ప్రాంతంలో కాలి నడకనే పాఠశాలకు వెళ్తున్నారు. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో నిర్మించిన పాఠశాలకు సిబ్బందిని కేటాయించి, తరగుతులు ప్రారంభించాలని కోరుతున్నారు.

వెలుగునిచ్చిన వైఎస్సార్.. అభివృద్ధి చేసిన వైఎస్ జగన్

దాదాపుగా నలభై ఏళ్ల క్రితం తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి వలస వచ్చిన కొందరు మన్నెసుల్తాన్‌పాలెం - వెంకటాయపాలెం గ్రామాల మధ్య ఉన్న శ్రీ రామాంజనేయపురం అటవీ ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. స్థానికంగా అటవీ భూములను సాగు చేసుకుంటూ 200 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో నివాసం కావడంతో.. వారికి కనీస వసతులు కూడా లేవు. 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రామంలో విద్యుత్ లేన్ ఏర్పాటు చేశారు. అది మినహా గ్రామంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అటవీ శాఖ అధికారులను గ్రామానికి పలుమార్లు తీసుకువచ్చారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న దుస్థితిని వివరించారు. కనీస సౌకర్యాలను కల్పించాలన్న లక్ష్యంతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, నివాసం ఉంటున్న ఇళ్లకు పట్టాలు ఇప్పించడం, పాఠశాల, తాగునీటి వసతి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మొదటిగా గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తి చేశారు. దీంతో నలభై ఏళ్లుగా ఆ గ్రామం ఎదుర్కొంటున్న పాఠశాల సమస్యకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిష్కారం చూపారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో వారి పరిస్థితి, మళ్లీ మొదటికొచ్చింది.

పాఠశాలకు సిబ్బందిని కేటాయించాలి



ఎన్నో ఏళ్ల పాఠశాల కలను గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే శంకర రావు నెరవేర్చారు. పాఠశాల నిర్మాణం పూర్తి అయ్యి.. ఏడాది కావస్తోంది. కానీ ఇంత వరకు పాఠశాలకు సిబ్బందిని కేటాయించలేదు. తరగతులను ప్రారంభించ లేదు. దీంతో పక్క గ్రామానికి వెళ్లి పిల్లలు చదుకోవాల్సి వస్తోంది. పాఠశాలకు వెంటనే సిబ్బందిని కేటాయించాలి.

– బొడ్డుపల్లి రాము, మాజీ సర్పంచ్, శ్రీరామాంజనేయపురం

పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు



ఊరిలో పాఠశాల నిర్మించినప్పటికీ, తరగతులు ప్రారంభించకపోవడంతో పక్క ఊరికి వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. బస్సు సౌకర్యం అంతంత మాత్రంగా ఉండడంతో ఆటోలు, బైక్‌లపై వెళ్తున్నారు. ఒక్కోసారి ఏమీ రాకపోతే ఇంటికి అటవీ ప్రాంతం ద్వారా నడిచి చేరుకుంటున్నారు. పిల్లలకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన తప్పడం లేదు. వెంటనే గ్రామంలోని పాఠశాలను ప్రారంభించాలి.

– మాచర్ల అంజి, స్థానికుడు, శ్రీరామాంజనేయపురం

20న జాబ్ మేళా

క్రోసూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్ అధ్వర్యంలో ఈ నెల 20న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ బీవీ రమాదేవీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. 18–35 ఏళ్లలోపు యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. బి.అంజి రెడ్డి 94949 86164, ఇ.రామకృష్ణ రెడ్డి 80743 93466 సంప్రదించాలన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుల ఎన్నిక



క్రోసూరు: స్థానిక కెనాల్స్ కార్యాలయంలో సోమవారం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ప్రక్రియతో సాగు నీటి సంఘాల ఎన్నికలు ముగిసాయి. నంబర్ 8 నీటి సంఘం నుంచి డీసీ అధ్యక్షుడిగా దూళ్ల సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా కందుల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి బాలాజీనాయక్ వారికి ఫాం-10 అందజేశారు. అచ్చంపేట మండలంలోని చామ్రుం నంబర్ 9 నీటి సంఘం అధ్యక్షుడిగా పసుపులేటి పాపిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.గోపి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కాశిరెడ్డి తెలిపారు. బెల్లంకొండ నంబర్ 7వ సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా అంచుల శివలక్ష్మీ, ఉపాధ్యక్షుడిగా చొక్కా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ధ్రువ పత్రం అందజేశారు.

చాగల్లులో పొలం పిలుస్తోంది

నకరికల్లు: రబీలో సాగు చేస్తున్న పంటలకు రైతు సేవ కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని చాగల్లు, కండ్లకుంట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.శ్రీనివాస్, వీహెచ్‌ఏ కె.కృష్ణ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు బాలికల భవితకు శాపం



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రమీల

సత్తెనపల్లి: బాల్య వివాహాలు బాలికల భవితకు శాపంగా మారుతున్నాయని ఐసీడీఎస్ సత్తెనపల్లి సూపర్వైజర్ పి.ప్రమీల పేర్కొన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల కిశోర బాలికలకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బడికి వెళ్లాల్సిన వయసులో పెళ్లి పీటలు ఎక్కి... పుస్తకాలు పట్టాల్సిన బాలికలు పుస్తెల దండతో అత్తారింటికి వెళ్తున్నారని విచారం వ్యక్తం చేశారు. పట్టుమని 15 ఏళ్లు నిండకుండానే భార్యగా, తల్లిగా బాధ్యతలు మోస్తున్నారన్నారు. పేదరికం ఒక వైపు, ఆడ పిల్లల భారం తీరుతుందని కన్నవారే సంసారం అనే సాగరంలోకి బాలికలను నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలు అనారోగ్యం పాలవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమనే విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయాల్సిన బాధ్యత విద్యార్థినులపై కూడా ఉందన్నారు. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందన చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అలాగే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 2, 3 వార్డుల అంగన్వాడీ కార్యకర్తలు వై.అరుణ, బి.శాంతిబాయి, వి.కిరణ్మయ్ పాల్గొన్నారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణమూర్తి మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి

సత్తెనపల్లి: పట్టణానికి చెందిన డీసీసీ ప్రధాన కార్యదర్శి తుమ్మలగుంట రామకృష్ణమూర్తి (67) గుండె పోటుతో హైదరాబాదులో మృతి చెందారు. రామకృష్ణ మూర్తి మృతదేహాన్ని మంగళవారం సత్తెనపల్లి తీసుకొచ్చారు. సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గార్లపాటి ప్రభాకర్, న్యాయవాదులు మాధంశెట్టి వేదాద్రి, జొన్నలగడ్డ విజయ్ కుమార్, జనసేన నాయకుడు తవిటి భావనారాయణ, ప్రజా సంఘాల నాయకులు కొరబండ ఆంథోని, జిల్లెల్ల పాల్‌రాజు, రొంపిచర్ల పురుషోత్తం, మస్తాన్‌వలి తదితరులు నివాళులర్పించారు. మృతుడికి భార్య లక్ష్మీ కామేశ్వరి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మత్స్యం..శ్రీరామచంద్ర అవతారం



స్వామివారి గ్రామోత్సవం

అచ్చంపేట: ధనుర్మాస ఉత్సవాలలో భాగుగా స్థానిక సీతారామస్వామి దేవాలయంలో శ్రీరామచంద్రుడు భక్తులకు మత్స్య అవతారంలో మంగళవారం దర్శనభాగ్యం కలిగించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య మహిళా విభాగం భజన కార్యక్రమాలు నిర్వహించింది. పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

నకరికల్లు: పలు ఆలయాల్లో ధనుర్మాసం పూజలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేచవరం శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ భక్త బృందం విఘ్నేశ్వరస్వామి ఆలయం నుంచి గ్రామ సంకీర్తన ప్రారంభించి, హరే రామ హరే కృష్ణ..అంటూ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ముగించారు.

ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



బెల్లంకొండ: ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పలు ఆరోగ్య కార్యక్రమాలను చేపడుతోందని మండల ఆయుర్వేద వైద్యులు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 'దేశ్‌కా ప్రకృతి పరీక్షణ్' యాప్‌పైన వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 25 వరకు యాప్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. యాప్‌లో ప్రతి పౌరుని ఆరోగ్య సమాచారాన్ని సిబ్బంది నమోదు చేయించాలని తెలిపారు. నమోదు చేయించుకున్న వారికి పలు ఆరోగ్యాంశాలపై ప్రతిరోజు మెసేజ్ రూపంలో సూచనలు అందించడం జరుగుతుందని తెలిపారు. యాప్‌లో నమోదు చేసుకున్న సిబ్బందికి ఎంపీడీవో హనుమారెడ్డి సర్టిఫికేట్‌లను అందజేశారు. ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈవోపీఆర్డీ వెంకటరెడ్డి, ఏపీవో కోటమ్మ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యం



శిక్షణలో మాట్లాడుతున్న సత్తెనపల్లి ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

సత్తెనపల్లి: పల్లెల అభివృద్ధే లక్ష్యమని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమం కింద వీఆర్వోలు, మహిళా పోలీసులు, వెటర్నరీ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు, ఎనర్జీ అసిస్టెంట్ల మూడో బ్యాచ్‌కి మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఎంపీడీఓ ఐక్య రాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు చేరుకునేందుకు.. గ్రామ స్థాయిలో 9 థీమ్స్ కింద చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. 17 లక్ష్యాల్లోని కీలక అంశాలను వివరించారు. ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వెల్లడించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ అనంతలక్ష్మి బాల్య వివాహాల నిరోధానికి చేపట్టాల్సిన చర్యలను ప్రస్తావించారు. ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మండల విస్తరణ అధికారి కె.శ్రీనివాసరెడ్డి, ఏపీఎం సమాధానం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శృతి, పంచాయతీ సెక్రెటరీ ప్రదీప్ శిక్షణ ఇచ్చారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

రాజుపాలెం: గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లకు, మండల స్థాయి అధికారుల మొదటి బ్యాచ్‌కు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్నందున మంచినీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. ఎంఈవో మల్లికార్జునశర్మ, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఏపీఎం శివకుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్‌కె రమాదేవి పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

బెల్లంకొండ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సుస్థిర, అభివృద్ధి లక్ష్యాలపై పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వై.హనుమారెడ్డి మాట్లాడుతూ.. 17 అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈవోపీఆర్డీ భవనం వెంకటరెడ్డి, ఆయుర్వేద వైద్యుడు ఆర్.శ్రీనివాస్, ఏపీవో కోటమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పరిమళ, వనజ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

పెదకూరపాడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో గ్రామ స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ పేదరికం లేని, జీవనోపాధి కలిగిన ఆరోగ్యవంతమైన, భద్రత కలిగిన గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను శిక్షణలో వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: గ్రామ పంచాయతీల సుపరిపాలన, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై రెండవ విడత శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాదల-1, 2, బొల్లవరం, తొండపి, ఇరుకుపాలెం, రుద్రవరం గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల సుస్థిరాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ అందించారు. ఈఓపీఆర్డీ ఎస్.రూపవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ, ఆయా గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



పెదకూరపాడులో ఉద్యోగులు, అధికారులు

ముగిసిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ శిక్షణ తరగతులు



సమస్య వింటున్న నకరికల్లు తహసీల్దార్ కె.పుల్లారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

భూ సమస్యలకు పరిష్కారం

రాజుపాలెం: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎన్.దుర్గేష్‌రావు తెలిపారు. రాజుపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 15 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ పులిబండ్ల అశోక్, మండల ప్రత్యేక అధికారి ఐసీడీఎస్ పీడీ ఉషారాణి, ఎండోమెంట్ ఈవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దారు జానీ బాషా, ఆర్ఐ వంశీకృష్ణ పాల్గొన్నారు.

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో తహసీల్దార్ భవానిశంకర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ కుమ్మరి ఏడుకొండలు, జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీ ప్రసాదు, ఎంపీటీసీ రామారావు, ఏఓ అరుణ పాల్గొన్నారు.

నకరికల్లు: చల్లగుండ్ల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.పుల్లారావు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రైతులకు ఇదో చక్కటి వేదిక అని పేర్కొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ఆయన నిర్ణీత సమయంలో పరిష్కారం చూపుతామని తెలిపారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



అమరావతి: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి బ్యాంకర్లతో పాటు తాము కూడా సహకరిస్తామని పెదకూరపాడు ఉప ట్రెజరీ అధికారి ఎస్.ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక యోగాశ్రమంలో నిర్వహించిన అమరావతి మండల పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మండల పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ సభ్యులు బ్యాంకర్లు, ట్రెజరీతో సమన్వయం చేసుకోవాలన్నారు. 75 ఏళ్లు నిండిన అసోసియేషన్ సభ్యులందరిని ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు మానం సుబ్బారావు, ప్రభుదాస్, అదిశేషయ్య, ప్రసాద్ ప్రసంగించారు. మధ్యాహ్నం వంకాయలపాటి సంగమేశ్వరచారి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పెన్షనర్లందరికీ విందు ఏర్పాటు చేశారు.